క్లుప్తంగా

వృత్తి విద్యా నైపుణ్యం అవసరం



కుట్టు మిషన్ శిక్షణను పరిశీలిస్తున్న జీసీడీఓ నీరజాక్షి

రణస్థలం: నూతన విద్యా విధానం ప్రకారం సాధారణ పాఠ్యాంశాలతోపాటు విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్చుకోవడం అవసరమని జిల్లా బాలల అభివృద్ధి అధికారి (జీసీడీఓ) నీరజాక్షి తెలిపారు. ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండలంలోని రణస్థలం ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీపై దసరా సెలవుల్లో ఇచ్చిన శిక్షణను పరిశీలించారు. విద్యార్థులకు వృత్తి విద్య ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణ, వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు కె.సూర్యకుమారి ఉన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ప్రమీల



జి.సిగడాం: స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ప్రమీల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె వీరఘట్టం కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన దాసరి ఉషారత్న కుమారి వీరఘట్టం ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు



విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న హైవే అధికారులు

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి మధ్యలో రామతీర్థాలు కూడలి వద్ద ఎన్‌హెచ్ఐ అధికారులు సోమవారం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఇలాగే పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు వేయాలని మండల కేంద్రం వాసులు కోరుతున్నారు.

విద్యార్థికి అభినందన



ఈశ్వర్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామానికి చెందిన చిలక ఈశ్వర్ హెచ్‌పీఎస్ డిగ్రీ కాలేజ్ శ్రీకాకుళంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి జాతీయ స్థాయి అథ్లెట్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యాడు. ఈ విద్యార్థిని కళాశాలలో సోమవారం డైరెక్టర్ హనుమంతు పోలినాయుడు, పిన్సిపాల్ తమ్మినేని రామారావు, సిబ్బంది అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థికి సత్కారం



ఈశ్వరరావును సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: చిలకపాలెం గ్రామానికి చెందిన చిలక ఈశ్వరరావు శ్రీకాకుళం నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో కళాశాల ప్రతినిధులు ఈశ్వరరావును సోమవారం సత్కరించి అభినందించారు. జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు, కళాశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి హనుమంతు పోలినాయుడు, ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు, ఏవో హెచ్.బోసుబాబు, కొత్తకోట రవీంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల విక్రయం



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎచ్చెర్ల మండల మహిళా సమాఖ్య పరిధిలో పండించిన కూరగాయలు సోమవారం ఎచ్చెర్ల మండల కేంద్రంలో విక్రయించారు. ఆకు కూరలు, కూరగాయలు రైతులు నేరుగా అమ్మకం చేపట్టారు. ప్రతీ సోమవారం రైతులు అమ్మకం చేపడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు, ఇతరులు కొనుగోలు చేశారు.

బండి ఇసుక రూ.1,500



టైరు బండ్లతో తరలిస్తున్న ఇసుక

- పెరుగుతున్న నిర్మాణాలు
- ఇసుక అందుబాటులో లేక నిర్మాణదారుల అవస్థలు
- పేరుకే ఉచితం.. టైరు బండ్లే ఆధారం

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్మాణ రంగంలో ఇసుక ప్రధానం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక ఉచితమని ప్రకటించింది. క్షేత్రస్థాయిలో మాత్రం ధరలు అమాంతం పెరిగాయి. అధిక ధర చెల్లించి ప్రభుత్వ స్టాక్ పాయింట్ నుంచి ఇసుక తీసుకొస్తామన్నా.. సకాలంలో లభ్యం కావటం లేదు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలంల్లో ఇసుక ప్రధాన సమస్యగా మారింది. చాలా వరకు నాటు బండ్లపైన ఇసుక కోసం ఆధార పడుతున్నారు. ఎచ్చెర్ల మండలంలో తోటపాలెం, తమ్మినాయుడుపేట, పొన్నాడ ప్రాంతాల నుంచి టైరు బండ్లపై ఇసుక తెచ్చి విక్రయిస్తున్నారు. గుజరాతిపేట, హయితీనగరం ప్రాంతాల నుంచి సైతం ఇసుక తెచ్చి అమ్ముతున్నారు. దూరం బట్టి టైరు బండి ఇసుక ధర రూ.1200 నుంచి రూ.1500 పలుకుతోంది.

స్టాక్ పాయింట్ లేక ఇబ్బంది..

ప్రభుత్వ స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక లభ్యం కావటం లేదు. ఒక వేల లభ్యమైనా వినియోగదారులు అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. నియోజకవర్గంలో దూరం బట్టి ట్రాక్టర్ ఇసుక (నలుగున్నర టన్నులు) రూ.8 వేల నుంచి రూ.10 వేలు పలుకుతోంది. 18 టన్నుల లారీ రూ.30 వేల నుంచి రూ. 35 వేల వరకు ఉంటోంది. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి అందుబాటులో ప్రభుత్వ స్టాక్ పాయింట్ లేక పోవటం ప్రధాన సమస్య. ఉన్న స్టాక్ పాయింట్లు దూరంగా ఉండటం వల్ల రవాణా ఖర్చు భారంగా మారతోంది.

నది ఇసుక పేరుతో సముద్రం ఇసుక విక్రయం..

టైరు బండ్లతో ఇసుక తెచ్చి పోగులు వేసి రాత్రులు ట్రాక్టర్లతో తరలిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతోపాటు ప్రస్తుతం నియోజకవర్గంలో సముద్రం ఇసుక, నది ఇసుకతో కలిపి అమ్ముతున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ఇసుక విరివిగా లభించక పోవటం సమస్యగా మారుతోంది.

ఇసుక అందుబాటులో ఉండటం లేదు



ప్రభుత్వం ఉచిత ఇసుక అమ్మకం చేపడుతున్నట్లు చెబుతోంది. వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఇసుక అందుబాటులో ఉండటం లేదు. నిర్వహణ, రవాణా ఖర్చులు చెల్లించి వినియోగదారులు ఇసుక కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నా ఇసుక లభించటం లేదు.

– కొత్తకోట సూర్యారావు, కేశవరావుపేట, ఎచ్చెర్ల మండలం

స్టాక్ పాయింట్లు దూరంగా ఉన్నాయి



ఎచ్చెర్ల నియోజకవర్గానికి స్టాక్ పాయింట్లు దూరంగా ఉన్నాయి. దీంతో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారికి అనుకోని ఉండటం, శ్రీకాకుళం పట్టణానికి దగ్గరగా నియోజకవర్గం ఉండటం వల్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిర్మాణాలు జరుగుతున్న స్థాయిలో ఇసుక లభ్యం కావటం లేదు.

– దొంక వెంకటరమణ, చిలకపాలెం, ఎచ్చెర్ల మండలం

వెయిట్‌లిఫ్టర్ వర్షితకు అభినందనలు



వర్షితను అభినందిస్తున్న దృశ్యం

గార: అంపోలు పంచాయతీ ఆడవరం గ్రామానికి చెందిన గుజ్జల వర్షిత హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడంపై అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం వర్షిత గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. హిమాచల్‌ప్రదేశ్ వెయిట్‌లిఫ్టింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్స్ పోటీల్లో వర్షిత 103 కేజీల ఎత్తి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరరావు, సోనుం తిరుపతిరావు దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. అంపోలు జంక్షన్ నుంచి ఆడవరం గ్రామం వరకు ఊరేగింపుగా వర్షితను తీసుకువచ్చి పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



రణస్థలం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



గార: ఆరంగిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార: మౌలిక వసతులు కల్పించేందుకు పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార పంచాయతీ అరంగిపేట, తూలుగు, వత్సవలస పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లుకు భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు, సర్పంచ్‌లు మార్పు పృధ్వీరాజ్, కొయ్యాన సంధ్యారాణి, బడగల వెంకటప్పారావు, గుండ భాస్కరరావు ఉన్నారు.

శ్రీకాకుళం రూరల్: పల్లెపండుగ వారోత్సవాలను కిష్టప్పపేట గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకూ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సింగుపురం, కరజాడ, బైరి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రణస్థలం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మహంతిపాలెంలో సోమవారం ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ ఈశ్వరరావు, కుటమి నాయకులు పాల్గొన్నారు.

- జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఈశ్వరరావు హాజరయ్యారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్, నాయకులు భూపతి శ్రీరామ్మూర్తి, ఎంపీపీ మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, ఎంపీటీసీ పట్నాన శాంతి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలను ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. హెచ్ఎం వి.శ్రవణకుమార్, సిబ్బంది ఉన్నారు.

సాగునీటికి అవస్థలు

జి.సిగడాం: వరుణుడు కరుణించడం లేదు. మడ్డువలస కాలువ ద్వారా చుక్కనీరు రావడంలేదు. దీంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. వరి పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో నీటికోసం పాట్లు అన్నీఇన్నీకావు. ఇటువంటి సమయంలో ప్రతి ఏటా ఏదో ఒక రూపంలో రైతన్న గుండె పగులుతోంది. కళ్ల ముందే పంట పాడవ్వడంతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. పలు గ్రామాలలో సాగునీటి చెరువులు కూడా ఎండి పోవడంతో పంటను బతికించేందుకు రాత్రీ, పగలు శ్రమిస్తున్నాడు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి చివరికి అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చివరి తడికోసం సుదూర ప్రాంతాలకు మోటర్లు తీసువెళ్లి నీటిని పెడుతున్నారు.



రాత్రి సమయంలో పొలం వద్ద నిద్రిస్తున్న రైతు



వరి పంట

ఎస్పీని కలిసిన సీఐ త్రినేత్రి



ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న సీఐ త్రినేత్రి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన టి.త్రినేత్రి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూలమొక్కను బహుకరించారు. త్రినేత్రి విశాఖపట్నం రేంజి వీఆర్ నుంచి ఇక్కడకు వచ్చారు.

రిమ్స్ డీడీ శ్రీనివాస్‌కుమార్‌కు అభినందనలు



శ్రీనివాస్‌కుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) డిప్యూటీ డైరెక్టర్‌గా చిట్టూరి శ్రీనివాసకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మెడికల్ కాలేజీ ఏవో మనోజ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలుహమంతి ఉమామహేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిమ్స్ పరిపాలన అధికారి పైడి ప్రదీప్, జవహర్, ప్రకాష్, నాగేశ్వరరావు ఉన్నారు.

18న మండల సమావేశం

రణస్థలం: ఈ నెల 18న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజిని అధ్యక్షత సమావేశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సజావుగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్– 2024 పరీక్షలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయి. ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో సోమవారం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి షిఫ్టులో 100 మందికి 92 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 92 మంది హాజరయ్యారు. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

గార: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న తమను పునరుద్ధరించాలని కాంట్రాక్ట్ లెక్చరర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సోమవారం కళింగపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పసుపు రిబ్బన్లు పెట్టుకొని విధులకు హాజరయ్యారు. జీవో 114 పునరుద్ధరించి తమను ఆదుకోవాలని విడుకున్నారు. కార్యక్రమంలో సాధు మల్లిబాబు, పొన్నాడ అప్పలనాయుడు, ఎన్ని రమణారావు, వై.రామకృష్ణ, ఎస్‌వీవీ సత్యన్నారాయణ, కె.శ్రీను, రాణా రాజేంద్రబాబు ఉన్నారు.

వైద్య శిబిరం రేపు

రణస్థలం: ఈ నెల 16వ తేదీన మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇదదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి, గుండె, బీపీ, సుగర్ వంటి రోగాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సూర్య ఆస్పత్రి ఆవరణలో వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మ ఒడిలోకి దుర్గమ్మ..



విశాఖ-బీ కాలనీలో అమ్మవారి ఊరేగింపు



దుర్గాదేవిని నాగావళి నదిలో నిమజ్జనం చేస్తున్న భవానీలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాల త్రిపుర కాలభైరవస్వామి పీఠం దేవాలయంలో శరన్న నవరాత్రులు ముగిశాయి. దీంతో ఇక్కడ ఇప్పటివరకూ పూజలందుకున్న దుర్గా అమ్మవారి విగ్రహాన్ని నాగావళి నదిలో సోమవారం నిమజ్జనం చేశారు. ముందుగా గణేష్ గురూజీ ఆధ్వర్యంలో ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా భవానీ భక్తుల శరణుఘోషతో అంగరంగ వైభవంగా తీసుకొని వెళ్లి పవిత్ర నాగావళి నదిలో నిమజ్జనం చేశారు.

విశాఖ–బీ కాలనీలో..

విశాఖ-బీ కాలనీలోని షిర్డీసాయి మందిరంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఊరేగింపు నిర్వహించి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. అమ్మవారికి మేళతాళాలతో కోలాటం మధ్య తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో కొంక్యాన చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కె.మురళీధర్, రిటైర్డ్ డీఎస్పీ, హైకోర్టు న్యాయవాది శమళ్ల వెంకట వరప్రసాద్‌రావు, మధువిలేకరి, అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, వేణు, అంబటి అమ్మాజమ్మ, పాట్నూరు సత్యవతి, సనపల ప్రేమకుమారి, సరోజనమ్మ పాల్గొన్నారు.

సందడిగా సరస్వతీదేవి విగ్రహం ఊరేగింపు



అఘోరాల ప్రదర్శన



సరస్వతీదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని అరసవల్లి బొంపాడవీధిలో దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం నిమజ్జనం ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణానికి చెందిన బురద పోలమ్మ అఘోరాల పదర్శన ఊరేగింపులో జనాలను ఆకర్షించింది. అనంతరం నాగావళి నదిలో సరస్వతీదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి



నిర్వహణ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న డీఎస్పీ వివేకానంద

ఎచ్చెర్ల కాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటలో ప్రశాంతంగా గౌరీ పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద సూచించారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులతో సోమవారం చర్చించారు. గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న నేర సంఘటనలు, గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్ నేపథ్యంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. వేడుకల నిర్వహణలో ఎటువంటి లోపాలున్నా నిర్వహణ కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాలుగు రోజులపాటు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామన్నారు. మూడు వర్గాల నుంచి పండగ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వి.సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

'మతమా.. మానవత్వమా' నాటికకు తృతీయ బహుమతి



వీణ అవార్డుతో లలితశ్రీ కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెనాలి వీణ అవార్డ్స్ కళల కాణాచి, విజయవాడ, వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ప్రతిష్టాత్మకంగా జరిగిన నాటిక పోటీలలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన లలిశ్రీ కళాసమితి నిర్వహణలో కంచెర్ల సూర్యప్రకాశరావు రచించిన 'మతమా.. మానవత్వమా'నాటికకు తృతీయ బహుమతి లభించింది. ఈ విషయాన్ని కళాసమితి ప్రతినిధులు ఎల్.రామలింగస్వామి సోమవారం తెలిపారు. ఈనెల 11న ప్రదర్శన ఇచ్చామని, ఉత్తమ ఆహార్యం సింగూరు రమణకు, ఉత్తమ సహాయ నటుడుగా గుత్తు రవిబాబుకు వీణ అవార్డ్స్ కూడా వచ్చాయన్నారు. నవంబర్ తొమ్మిదో తేదీన మేరింగి గ్రామంలో జరగనున్న నాటిక పరిషత్‌లో పాల్గొంటామన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తాం..



మాట్లాడుతున్న పేడాడ శ్రీరామ్మూర్తి

జి.సిగడాం: మడ్డువలస ప్రాజెక్టు ద్వారా రెండు రోజుల్లో సాగునీరు ఇవ్వకపోతే మండలంలోని రైతులతో కలిసి కలెక్టర్ వద్ద ధర్నా చేస్తామని, ఈ విషయాన్ని నేరుగా సీఎం దృష్టికి తీసుకువెళ్తామని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తి, దవళపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి మండలానికి మడ్డువలస కాలువ ద్వారా చుక్కనీరు కూడా రాలేదన్నారు. ఆనందపురం, దవళపేట, వాంద్రంగి, పెంట, నాగువలస, పాలఖండ్యాం, టీడీవలస, సంతవురిటి, అబోతులపేట, నిద్దాం, మెట్టవలస తదితర గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల వరి పంట పొట్టదశలో ఉందన్నారు. సాగునీరు అందకపోతే వరి పంట పాడవుతుందన్నారు. ఎన్ని వినతలు ఇచ్చినా అధికారులలో చలనం రాలేదన్నారు. రైతులు కంచరాన రమణరావు, పేడాడ నారాయణరావు, పేడాడ కృష్ణంరాజు, పేడాడ శ్యామలరావు పాల్గొన్నారు.